దారి తప్పిన ఏనుగు



- గురువారం మరొక రైతు హతం
- గ్రామాల్లో భయం.. భయం..
- బయటకి వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు
- రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఏనుగు భీభత్సం ఇదే మొదటిసారి
- మూడు మండలాల్లో 144 సెక్షన్

చింతలమానేపల్లి/పెంచికలపేట/బెజ్జూరు, ఏప్రిల్ 4 : జిల్లాలోని రాష్ట్రసరిహద్దు మండలాలైన చింతల మానేపల్లి, పెంచికలపేట, బెజ్జూరు తదితర మండలాల ప్రజలు బయటకు వెళ్లేందుకు జంక తున్నారు. ఏనుగు భీభత్సం సృష్టించి ఇద్దరు ప్రాణాలను బలి తీసుకోవడంతో జిల్లాలో గందరగోళ పరిస్థితులు నెల కొన్నాయి. గతంలో పులులు మనుషులపై దాడిచేసి హతమార్చిన సంఘటనలు చూశాం. కానీ జిల్లాలో మొట్టమొదటిసారిగా ఇద్దరి ప్రాణాలను ఏనుగు బలితీసుకోవడం కలకలం సృష్టిస్తోంది.

చింతలమానేపల్లి మండలం బూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్(56) అనే రైతును బుధవారం సాయంత్రం తొక్కి బలి తీసుకోగా, ఈ ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే గురువారం పెంచికలపేట మండలం కొండపల్లి గ్రామానికిచెందిన కారు పోశయ్య (57) వ్యవసాయ పనుల కోసం తనచేనుకు వెళ్తున్న క్రమంలో ఒక్క సారిగా దాడిచేసి హత మార్చింది. దీంతో గ్రామాల ప్రజలు ఏనుగు అలజడిపై అప్రమత్తంగా ఉండేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో డప్పు చాటింపు చేపట్టి ఎవ్వరూ ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, ఏనుగు ఇప్పటికే ఇద్దరిని హతమార్చిన విషయాన్ని తెలియజేస్తూ తగు సూచనలు సలహాలు చేస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి ఇక్కడకు..

జిల్లా సరిహద్దు మండలాలు మహారాష్ట్రకు ఆను కొని ఉండడం ప్రాణహిత నదీ పరివాహక ప్రాంతం నుంచి ఏనుగు ఇక్కడకు ప్రవేశించినట్లు అధికారులు పేర్కొంటు న్నారు. అయితే మహారాష్ట్ర గడిచిరోలి అడవుల్లో ఏనుగుల గుంపులో నుంచి ఒక్కటి విడి పోయి ఇక్కడకు వచ్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. బూరెపల్లి గ్రామంలో రైతు శంకర్‌పై దాడిచేసి హతమార్చిన అనంతరం ఏనుగు కోసం ప్రత్యేక బృందాలతో గాలించినప్పటికీ రాత్రి సమయం కావడంతో దాని ఆచూకీ దొరకలేదు.

తెల్లారేసరికి చింతల మానేపల్లి మండలం బూరె పల్లి గ్రామ శివారు నుంచి బాలాజీఅనుకోడ, గంగా పూర్, కర్జెల్లి, బారెగూడ, సులుగు పల్లి మీదుగా పెంచికలపేట మండలం కొండపల్లికి చేరుకొని ఉదయం కొండపల్లిలో మరొక వ్యక్తిని హతమార్చడంతో గ్రామాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు ఏనుగు కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతి చెందిన వారికి ప్రభుత్వం నుండి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియాను ప్రకటించారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామాల్లో డప్పు చాటింపు

థర్మల్ డ్రోన్ కెమెరాలతో అన్వేషణ..

జిల్లాలో ఇద్దరిని హతమార్చిన గజరాజు ఆచూకీ కోసం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో థర్మల్ డ్రోన్ కెమెరాలతో రాత్రివేళలో అన్వేషణ కొనసాగిస్తున్నారు. బెజ్జూరు, పెంచికలపేట రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలతో పరిశీలించిన ఎలాంటి జాడ లభించలేదన్నారు. ఏనుగు ఆచూకీ కోసం 30 మంది ట్రాకింగ్ సిబ్బందిని, అటవీ సమీప గ్రామాల్లో ఇద్దరు చొప్పున ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అటవీ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో గట్టిచర్యలు తీసుకుంటున్నారు.

ఏనుగును పట్టుకునే అనుమతి అటవీశాఖకు లేదని, ప్రభుత్వం నిర్ణయం మేరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదిలాబాద్ సర్కిల్ కన్జర్వేటర్ శాంతారాం ఈ ప్రాంతంలోనే మకాం వేసి పరిస్థితిని గమనిస్తూ అధికారులకు తగు సూచనలు ఇస్తున్నారు. కాగా ఇప్పటికే ఏనుగు సంచారంపై చింతల మానేపల్లి, పెం చికలపేట, బెజ్జూరు మండలాల్లో జిల్లా కలె క్టర్ 144సెక్షన్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు.

వసతి ఉన్నా ఆహారం దొరకదు..

ఈ ప్రాంతంలో ఏనుగులకు ఉండేందుకు అనువైన ప్రాంతం కాదని అటవీఅధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడికి వచ్చిన ఏనుగులకు ఉండేందుకు వసతి ఉన్నా ఆహారం మాత్రం వాటికి దొరకని పరిస్థితులు ఉంటాయన్నారు. ఈ క్రమంలోనే అవి ఉండేందుకు వీలు కాదని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడ తిరుగుతున్న ఏనుగు వయసు సుమారు 25-30ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. ఏనుగు రోజుకు30కి.మీటర్ల మేర ప్రయాణం చేస్తుందని మగఏనుగు కావడం తో తోడు లేక అలజడి సృష్టించి ఉండొచ్చని భావిస్తున్నారు. రాత్రి వేళలో మాత్రమే ఎక్కువగా సంచారం చేసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలి..

డా. పాల్వాయి హరీష్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

ఏనుగు దాడిలో మృతిచెందిన కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్‌గ్రేషియా అందజేసి కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. ఏనుగు దాడిలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రితో పాటు అటవీశాఖ మంత్రి మృతుల కుటుంబాలను పరామర్శించి జిల్లా ప్రజల్లో భరోసా నింపాలన్నారు. ఏనుగును తిరిగి చత్తీస్‌ఘడ్‌లోని అటవీప్రాంతంలోకి పంపించడానికి అటవీ అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.



అల్లూరి శంకర్ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

ఇద్దరు చనిపోవడం బాధాకరం

- ● ఏనుగుకు హాని కలిగించొద్దు
- ● కర్ణాటక, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర అటవీ అధికారులతో మాట్లాడాం
- ● ప్రజల రక్షణకు పటిష్ట చర్యలు ● వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ పర్గేన్



బెజ్జూరులో మాట్లాడుతున్న వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ పర్గేన్

బెజ్జూరు, ఏప్రిల్ 4: ప్రజల రక్షణ కోసం అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) పర్గేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏనుగుదాడిలో ఇద్దరు అమాయక రైతులు చనిపోవడం బాధాకర విషయమన్నారు. ఏనుగు దాడి చేసినప్పటి నుంచి అటవీ, పోలీసుశాఖలు ప్రజల రక్షణ కోసం సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు.

రెండు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు 60నుంచి70 ఏనుగులు, రెండు రోజుల క్రితం 20నుంచి 30ఏనుగులు గుంపులు వచ్చాయని ఈ గుంపు నుంచే ఒక ఏనుగు ఈ ప్రాంతానికి వచ్చిందన్నారు. దానికి ప్రజలు ఎలాంటి హానీ తలపెట్టకూడదన్నారు. అప్పుడే అది ఇక్కడి నుంచి వెళ్లి పోతుందని అన్నారు. ఏనుగులను నియంత్రించే పద్ధతిని తెలుసుకునేందుకు ఇప్పటికే కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అటవీ అధికారులతో మాట్లాడి నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు నిత్యం రాకపోకలు చేస్తుంటాయన్నారు. మరోదాడి జరక్కుండా ఉండేందుకు అటవీశాఖ ప్రత్యేకచర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అధికారులంతా ప్రజల రక్షణకోసం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏనుగు ఆచూకీ కనుగొనేందుకు డ్రోన్ కెమెరాలతో అన్వేషిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మరో హానీ కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్లో భయాందోళనలు లేకుండా అధికారులు అవగాహన కలిగించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆదిలాబాద్ సర్కిల్ సీఎఫ్ శాంతారాం ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4: జిల్లాలోని చింతలమానేపల్లిలోకి ప్రవేశించిన ఏనుగు ఇప్పటివరకు ఇద్దరి మృతికి కారణమైనట్లు ఎస్పీ సురేష్‌కుమార్ తెలిపారు. చింతల మానేపల్లి, పెంచికలపేట, దహెగాం, బెజ్జూరు మండలాల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఎవరు కూడా ఒంటరిగా చేను, పొలాల వైపు వెళ్లకూడదన్నారు. ఒంటిరిగా ఇళ్ల నుంచి ఎవరు బయటకి రాకూడదన్నారు. భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. అటవీ అధికారులతో సమ న్వయం చేసుకుంటూ ప్రత్యేకబృందాల ద్వారా ఏనుగు జాడ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

చింతలమానేపల్లిలో 144 సెక్షన్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 4: జిల్లాలోని పెంచికలపేట మండలం కొండపల్లి, చింతలమానేపల్లి మండలం బూరప్లి గ్రామంలో ఏనుగు బీభత్సం సృష్టించి ఇద్దరి మరణానికి కారణమైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేవాల మేరకు తహసీల్దార్ నాగరాజు గౌడ్ 144 సెక్షన్ అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై నరేష్‌కు ఈ కాపీని అందజేసి ప్రజలు అప్రమత్తంగా ఉండేటట్లు చూడాలని గ్రామ పంచాయతీ అధికారులకు ఆదేశాలుజారీ చేశారు. అడిషనల్ కలెక్టర్ వేణు మండల తహసీల్దార్ కార్యాలయంను సందర్శించి తహసీల్దార్ నాగరాజుగౌడ్, అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ బస్సుకు ఎదురైన ఏనుగు

పెంచికలపేట, ఏప్రిల్ 4: గురువారం రాత్రి 9గంటల ప్రాంతంలో కాగజ్‌నగర్ నుంచి బెజ్జూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు లోడ్పల్లి-సులుగుపల్లి మధ్యలో ఏనుగు తారసపడింది. దీంతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కొంత సమయం రోడ్డుపైనున్న ఏనుగు అనంతరం సమీప అటవీప్రాంతంలోకి వెళ్లడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న సీఎఫ్ శాంతారాం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రేపు శని త్రయోదశి వేడుకలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4: ఈనెల 6న శని త్రయోదశి వేడుకలు స్థానిక శనిమందిర్ ఆలయంలో నిర్వహిస్తున్నట్టు పూజారి నందకిషోర్ జోషి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శని భగవానుడికి మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

జూన్30వరకు నిరంతరాయంగా తాగునీరు అందించాలి

● ప్రత్యేక కార్యదర్శి కృష్ణా ఆదిత్య



ప్రత్యేక కార్యదర్శి కృష్ణా ఆదిత్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4: వేసవికాలాన్ని దృష్టిలో ఉంచు కుని జూన్30వరకు ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రత్యేకకార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకుడు కృష్ణా ఆదిత్య అన్నారు. గురువారం మంచిర్యాల కలెక్టరేట్‌లో కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్‌లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, జిల్లాలోని అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ జూన్‌మాసాంతం వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రతి ఒక్కరికి నీరు అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీల్లో బోరువెల్స్, మిషన్ భగీరథ నల్లాకనెక్షన్ల ద్వారా ప్రతిరోజు నీరు సరఫరా చేయాలన్నారు. పైప లైన్ లీకేజీలపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బోర్‌వెల్స్ ద్వారా నీటిని సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలతో పాటు మిగితా మండలాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆసిఫాబాద్ అధికారులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేసవిలో తాగునీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు యంత్రాంగం అందుబాటులో ఉంటూ నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాలలో కూలీలకు తాగునీటిని, షామియానాలు, ఓఆర్ఎస్ పాకెట్లు అందించాలన్నారు. పంచాయతీలలో పశువుల దాహార్తి తీర్చే విధంగా నీటి తొట్టెలలో నీటినినిండుగా ఉంచాలని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలి

● ఏఎస్పీ ప్రభాకర్‌రావు



ఖమానలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వాంకిడి, ఏప్రిల్ 4: పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో శాంతియుత వాతావర ణంలో జరిగేలా ప్రజలు సహకరిం చాలని ఏఎస్పీ ప్రభాకర్ అన్నారు. బుధవారం వాంకిడి మండలం ఖమాన గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్ని కలసంఘం సూచించిన గైడ్‌లైన్ ప్రకారం ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాల న్నారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు ఆయన పేర్కొ న్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తిం చినా, గొడవలు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలవేళ ఎలాంటి అనుమతులు లేకుండా దేవాలయాలు, మజీద్‌లు, చర్చిలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల గోడలపై ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నాయకులు ఇచ్చే మద్యం, డబ్బులు, ప్రలోభాలకు ప్రజలు గురికావద్దన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం ఖమాన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు సాగర్, రాములు, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

పన్ను వసూలు చేసిన అధికారులు

జైనూర్, ఏప్రిల్ 4: జైనూరులో ప్రతి గురువారం నిర్వహిస్తున్న సంతవేలం ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు వాయిదా వేయడంతో స్థానిక గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సంతలో వర్తకులనుంచి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా పశువుల సంత, కూరగాయల సంతలో పన్నుల రూపంలో గ్రామ పంచాయతీకి ఆదాయం రాబట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కోడ్ ముగిసేంత వరకు గ్రామ పంచాయతీ సిబ్బంది పన్నులు వసూలు చేస్తారని వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4: బాబుజగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనికలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలకు జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. జిల్లాలోనిఅన్ని తహసీల్దార్, మండలపరిషత్ కార్యాలయాల్లో జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు.

జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి, ఏప్రిల్ 4: సామాజికతత్వవేత్త సంఘసంస్కర్త మహాత్మ జ్యోతి బాపూలే, ఉద్యమశీలి, స్త్రీల, విద్యార్థికి కృషిచేసిన భారత తొలిమహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు కృషిచేయాలని పూలాజీ బాబాధ్యానకేంద్రం సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవరావు అన్నారు. గురువారం మండలంలోని ఎనోలిగ్రామంలో జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతిబాపూలే దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇనచార్జి అజ్మీరశ్యాంనాయక్, మాలిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, నాయకులు ప్రశాంత్, మాలి సంఘం డివిజన్ అధ్యక్షుడు మెంగాజీ, మోర్లె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మౌలిక వసతుల ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి, ఏప్రిల్ 4: ఉపాధిహామి పథకంలో పని ప్రదేశాల్లో చలువ పందిర్ల ఏర్పాటుతో పాటు తాగునీరు, మెడికల్‌కిట్ ఇతర ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. గురువవారం మండలంలోని గోయగాం, ధనోర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. అనతరం మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండుతుండడంతో చలవపందిర్లు వేయాలని సూచించారు. ఉపాధికూలి రూ.300లకు పెంచినందుకు ప్రతి ఒక్కరు పనికి రావాలన్నారు. ఆయనవెంట కార్యదర్శి బొజ్జిరావు, ఎఫ్ఏ చంద్రు, సిబ్బంది పాల్గొన్నారు.



సభ్యత్వానికి టీబీజీకేఎస్ శ్రీకారం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 4: తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం(టీబీజీకేఎస్) సింగరేణిలో స్వయంప్రతిపత్తి సంఘంగా ఉండేందుకు నిర్ణయంతీసుకున్న నేపథ్యంలో సభ్యత్వసేకరణ, చందాలకు శ్రీకారంచుట్టింది. గోదావరిఖనిలోని మూడు డివిజన్‌లలో రెండు రోజుల క్రితం సభ్యత్వ నమోదును చేపట్టింది. యూనియన్ కార్యాలయంలో సంఘం ఇన్‌చార్జీలు మిర్యాల రాజిరెడ్డి, రామ్మూర్తి సభ్యత్వాలను అందజేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు టీబీజీకేఎస్‌కు ఒక్క రూపాయి కూడా చందా ఇవ్వవద్దని హెచ్చరించింది. ఇటీవల బీఆర్ఎస్‌కు సంబంధం లేకుండా స్వయంప్రతిపత్తిగా ఉండనున్న నేపథ్యంలో యూనియన్‌కార్యకలాపాలు కొనసాగడానికి వనరులు ప్రధానం కావడంతో కార్మికుల నుంచి చందాలు, సభ్యత్వాలు సేకరిస్తున్నారు. గనుల వారీగా కార్మికులను కలిసి వారు ఇచ్చినంత విరాళాలు తీసుకోవాలని కోరనున్నారు. సంఘాన్ని బలోపేతంచేసి పూర్వవైభవం వచ్చేలా ముందుకు వెళ్తున్నారు. భవిష్యత్‌లో కార్మికుల సంక్షేమం కోసం పోరాటాలు చేయనున్నట్లు రాజిరెడ్డి, రామ్మూర్తి తెలిపారు.

శాంతిఖని గనిలో ప్రమాదం: కార్మికుడికి గాయాలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 4: బెల్లంపల్లిలోని శాంతిఖని గనిలో గురువారం జరిగిన ప్రమాదంలో గోడలశివకుమార్ అనే జనరల్‌మజ్దూర్ కార్మికుడికి గాయాలయ్యాయి. గనిలో మ్యాన్ రైడింగ్ చైర్‌లిఫ్ట్47ఎల్ స్టేషన్ వద్ద నుంచి 43వ లెవెల్ చైర్ లిఫ్ట్ స్టేషన్‌కు వచ్చే చైర్ జామ్ అయ్యింది. దీంతో శివకుమార్ చైర్‌ను తీస్తున్న క్రమంలో కుడిచేతి మధ్య, ఉంగరంవేళ్ల చివరిభాగాలు కట్ అయ్యాయి. దీంతో వెంటనే అతన్ని అధికారులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

లక్ష్యాన్ని చేరడం అభినందనీయం



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 4: సింగరేణి సంస్థ 70మిలియన్ టన్నుల బొగ్గుఉత్పత్తిని సాధించడం అభినందనీయమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం వారు సింగరేణి సీఎండీ ఎన్ బలరాంను కలిసి అభినందనలు తెలిపి, ఘనంగా సన్మానించారు. అనంతరం పలు డిమాండ్లను ఆయన ముందుంచారు. సింగరేణి భవిష్యత్తులో మనుగడ సాగించాలంటే కొత్త గనులు ప్రారంభించాలని, అంతర్గత ఖాళీలను అర్హులైన ఉద్యోగులతో భర్తీచేయాలన్నారు. అంతర్గత పదోన్నతులకు నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులు అర్హత సాధించడం లేదని, వారికి న్యాయం చేయాలని, బదిలీలు, పదోన్నతులు కౌన్సిలింగ్ విధానం ద్వారా పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. 2024-25బొగ్గుఉత్పత్తి లక్ష్యాన్ని చేరేందుకు కొత్తయంత్రాలు, మ్యాన్‌పవర్ అవసరమని, అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వాటన్నిటి పరిష్కారానికి సీఎండీ బలరాం హామీ ఇచ్చారు. సీఎండీని కలిసినవారిలో యూనియన్ అదనపు ప్రధానకార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధానకార్యదర్శులు కె సారయ్య, వైవిరావు, కె.వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, పిట్‌కార్యదర్శి గునిగంటి నర్సింగరావు ఉన్నారు.

ఏనుగు జాడ కోసం డ్రోన్ కెమెరాలతో అన్వేషణ

● సీఎఫ్ శాంతారాం



మాట్లాడుతున్న సీఎఫ్ శాంతారాం

బెజ్జూరు, ఏప్రిల్ 4: ఏనుగు జాడకోసం రాత్రి వేళల్లోనూ థర్మల్‌డ్రోన్ కెమెరాలతో అన్వేషి స్తున్నామని సీఎఫ్ (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) శాంతారాం అన్నారు. గురువారం స్థానిక అటవీశాఖ గృహంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతానికి బెజ్జూరు, పెంచికలపేట రేంజ్ పరిధిలోని అడవుల్లో డ్రోన్ కెమె రాల ద్వారా పరిశీలిస్తున్నామని దానికి ఆచూకీ లభించలేదన్నారు. ఇద్దరు రైతులను హతమార్చడం చాలా బాధాకరమన్నారు. ఛత్తీస్‌గఢ్ ఏరియా నుంచి తెలంగాణకు వచ్చిందని, గడ్చిరోలి అటవీప్రాంతంలో నాలుగేళ్ల నుంచి 23 ఏనుగులు తిరుగుతుండగా అందులో నుంచి విడిపోయిన ఏనుగు ప్రాణహితనది దాటి వచ్చిందని చెప్పారు. రోజుకు 30 కిలో మీటర్ల నడుస్తుందని దాని వయస్సు సుమారు 25-30ఏళ్ల ఉండవచ్చని చెప్పారు. ఏనుగు ఆచూకీ కోసం 30మందిని ట్రాకింగ్, అటవీ సమీపం గ్రామంలో ఇద్దరి చొప్పున సిబ్బందిని ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో నీటి వసతి ఉంది కానీ వాటికి ఆహారం దొరకదని తెలిపారు. శబ్దం లేకుండా దానిచ్చదే దాని ప్రాంతానికి వెళ్లి పోతుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఏనుగును పట్టుకునే అనుమతి లేదని ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. అటవీశాఖ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, ప్రజలు బయటికివెళ్లవద్దని పంటపొలాలకు వెళ్లేటప్పుడు చప్పుడుతో వెళ్లాలని అవగాహన కల్పిస్తున్నామనని ప్రజలు సహకరించాలని సూచించారు. సమావేశంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, రేంజ్‌అధికారి దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి పోలీసుల చేయూత

రెబ్బెన, ఏప్రిల్ 4: రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందిరానగర్ గ్రామానికి చెందిన గణపతి మృతిచెందాడు. గురువారం ఉదయం రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ గణపతి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల నగదును అందజేశారు.

రోడ్డుపైనే పశువులు

● రాకపోకలకు అంతరాయం

● ఇబ్బందులు పడుతున్న మండలవాసులు, వాహనదారులు



రోడ్డుపై తిరుగుతున్న పశువులు

జైనూర్, ఏప్రిల్ 4: జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, తర్వాత అతిపెద్ద మార్కెట్ ఏజెన్సీలోని జైనూర్ మార్కెట్. ఈ మండలానికి కెరమెరి, లింగాపూర్, సిర్పూర్(యు), జైనూర్ మండలానికి చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బస్టాండ్ ప్రాంతం రద్దీగా మారుతుంది. దీనికితోడు పట్టణంలో ఉన్న కొందరు వ్యక్తులు తమ పశువులను ఇష్టారాజ్యంగా వది లేస్తున్నారు. అవి ప్రధాన రోడ్డుపై నిలిచి తరచూ వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు వివరించామని అయినప్పటికీ వారు తమగోడు వినిపించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యజమానులు తమ పశువుల్ని ఇంట్లోనే కట్టేసి పుష్కలంగా మేత, తాగునీటి సదుపాయం కల్పిస్తే ఆ మూగ జీవులు బయటకు రావని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులు రోడ్డుపై సంచరించకుంగా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

పాఠశాలలో చోరీ

భీమారం, ఏప్రిల్ 4: మండలంలోని పాఠశాలల్లో దొంగలు పడి సామగ్రి ఎత్తుకెళ్తున్నారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మన ఊరు మన బడి, పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలకు రూ.70 లక్షలు మంజూరు కాగా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 12 తరగతి గదుల్లో ఫ్లోరింగ్, ఫ్యాన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పాత ఫ్యాన్‌లను తీసి మరో ప్రాంతంలో కాంట్రాక్టర్ తరలించి భద్రపరిచాడు. 16 ఫ్యాన్‌లు గదిలో భద్రపర్చగా 5 ఫ్యాన్‌లు కనబడకుండా పోయాయి. ఎంపీడీవో శ్రీనివాస్ పాఠశాల అభివృద్ధికి స్పోర్ట్స్ కిట్‌లను అందించారు. ఈ కిట్‌లో నుంచి ఒక బ్యాట్, మూడు బాల్స్ కనబడం లేదు. ఈ విషయంపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని దుండగలు పాఠశాలలోని కిటీకీలకు అమర్చిన ఇనుపరాడ్‌లను ధ్వంసం చేసి పాఠశాలలోకి చొరబడి ఫ్యాన్‌ల రెక్కలను ధ్వంసం చేశారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా పాఠశాలల్లో దొంగతనాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

విద్యుత్ సరఫరా ఉండగానే చోరీలు



వెంకటాపూర్‌లో దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్

కాసిపేట, ఏప్రిల్ 4 : మండలంలో కరెంటు దొంగలు రెచ్చిపోతు న్నారు. గతనెల 3న కాసిపేట 2వగనిపై హాలర్‌రూం నుంచి 40 మీటర్ల ఆర్మడ్ కేబుల్ చోరీకి గురి కాగా గత నెల 24న వెంకటాపూర్ శివారు ప్రాంతంలో ట్రాన్స్‌పార్మర్ నుంచి అల్యూమినియం కేబుల్ దొంగతనానికి గురైంది. ఈ రెండు ఘటనలు కూడా కరెంటు సప్లయి ఉన్నప్పుడే దొంగతనం జరగడం అధికారులను కలవరపెడుతుంది. కాసిపేట 2వ గనిలో కేబుల్‌తోనే హాలర్ పనిచేస్తుంది. పవర్ ఆన్‌లో ఉన్నప్పుడు కరెంటు తీగలను తాకడానికే భయపడతారు. కానీ దొంగలు 40 మీటర్ల కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. దీని విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. దొంగతనాలు జరిగి నెల రోజులైనా దొంగలను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. వెంకటాపూర్ శివారు ప్రాంతంలోని ఎగ్గండి ప్రాజెక్టు సమీపంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ గత నెల 24న దొంగతనానికి గురైంది. విద్యుత్ సరఫరా ఉండగానే ట్రాన్స్‌పార్మర్ పగులగొట్టి అల్యూమినియం కేబుల్ ఎత్తుకెళ్లారు. ఈ కేబుల్ విలువ రూ. 5 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. కరెంటు ఉన్నప్పుడే దొంగతనాలు జరగడం విద్యుత్ అధికారులతో పాటు పోలీసులు ఆశ్చర్యపోతున్నారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్,దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులును వివరణ కోరగా దొంగతనాలపై దర్యాప్తు చేస్తున్నా మని తెలిపారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల

అన్ని థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్ ఇవ్వబడును



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

11.00,2.30,6.00,9.30

ఈశ్వర్ 70ఎంఎం - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
శ్రీలక్ష్మి/ఇంద్రానాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30
సంతోష్ 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.15
శివశక్తి 70ఎంఎం ఎ/సి - కాప్రా 11.15,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
శ్రీసాయిరాం 70 - మల్కాజిగిరి 11.15,2.30,6.15,9.30

రేపే బ్రహ్మాండమైన విడుదల

సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి, జాకీష్రాఫ్ నటించిన సైన్స్ ఫిక్షన్ చిత్రం



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ఏ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి 1.15pm
గెలాక్సీ - టోలిచౌకి 7.20pm
పిఎస్‌ఐ - పంజాగుట్ట 2.45pm
బిగ్‌సినిమాస్ - మదీనగూడ 2.15pm
విమల్ - ఎల్.బి.నగర్ 4.30pm
ఎంటర్‌టైన్‌మెంట్ - నారపల్లి 1.25pm
ఆసియన్ సత్యం - అమీర్‌పేట 1.20pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 4.30pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.30am
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.40pm
మూవీటైమ్ - అమీర్‌పేట 11.00am
ఏషియన్ మాల్ - మాదాపూర్ 2.25pm

SBK FILMS - 9849761038/9652052424

విజయవంతమైన 2వ వారం నేడే చూడండి

SHATTERING RECORDS అట్లుంటది మనతోని



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

11.15,2.30,6.00,9.15

శ్రీలక్ష్మి/ఇంద్రానాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

నేడే బ్రహ్మాండమైన విడుదల

From the Director of Dorasani



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

11.00,2.00,6.00,9.00

GLOBAL CINEMAS LLP

నేడే బ్రహ్మాండమైన విడుదల



రాజధాని 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

NTR FILMS - 9030161717

రేపే బ్రహ్మాండమైన విడుదల

మలయాళంలో 200 కోట్లు సాధించిన



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

జగదాంబ 70 - ఘట్‌కేసర్ 11.30,2.30,6.30,9.30

First Air Conditioned theatre with Dolby atmos in hyderabad (Single Screen)

రాజధాని 70 ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ఇంద్ర/పద్మావతి 70 - కాచిగూడ 9.15 pm

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

మాల్గం మల్లన్న ఆలయంలో చోరీ



ఆలయం వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

దండెపల్లి, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని మాల్గం మల్లన్న ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు హుండీ పగులగొట్టి నగదు, దేవుడి గద్దె వద్ద ఉన్న వెండి కడియం, ప్రతిమలను దొంగిలించారు. ఆది, సోమవారాల్లో స్వామి వారి కల్యాణ మహోత్సవం, పట్నాల ఉత్సవాలు నిర్వహించారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదును తీసుకొని బయట పడేశారు. వెండి కడియం, ప్రతిమలను ఎత్తుకెళ్లారు. టెంటు సామాను తీసుకెళ్లడానికి వచ్చిన వ్యక్తి గమనించి గుడి పెద్దలకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం సంఘటన స్థలానికి సీఐ అల్లం నరేందర్, ఎస్సై స్వరూప్‌రాజ్ క్లూస్ టీమ్‌తో చేరుకొని పరిశీలించారు. యాదవ సంఘం నాయకుడు గొట్ల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దండేపల్లిలో ట్రాలీ ఆటో చోరీ

దండెపల్లి, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో శేఖ్‌హాజీకి చెందిన ఆటో ట్రాలీని బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. హాజీ పనికి వెళ్ళి వచ్చి సాయంత్రం ఆటో ట్రాలీని ఇంటి ముందు నిలిపి పడుకున్నాడని చెప్పారు. ఉదయం లేచి చూసే సరికి వాహనం లేక పోవడంతో చోరీకి గురైందని గుర్తించాడని పేర్కొన్నారు. హాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

నెన్నెల, ఏప్రిల్ 4: విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెన్నెలలో గురువారం ఉపాధిహామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సంస్థ కౌన్సిలర్లు గురునాథం శ్రీనివాస్‌గౌడ్, డి.రమేష్‌లు ఆర్థిక వ్యవహారాల్లో క్రమశిక్షణపై వివరించారు. కష్టపడి సంపాదించిన సంపాదనకు ఆర్థిక క్రమశిక్షణ గుర్తింపును, విలువలను తీసుకువస్తుందన్నారు. కేవైసీ నిబంధనలు, డిజిటల్ లావాదేవీల గూర్చి చెప్పారు. ఎస్‌హెచ్‌జీ, పంట రుణాలు, వ్యక్తిగత రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తక్కువ ప్రీమియంతో బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయని, బీమాతో భవిష్యత్తు సురక్షితం అవుతుందన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తత గూర్చి వివరించారు. మాజీ సర్పంచ్ సుజాత శ్రీనివాస్, కార్యదర్శి సాగర్, ఎఫ్ఏ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సహాయం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 : చిన్ననాటి మిత్రుడు దివంగత నాగమల్ల శ్రీనివాస్ కూతురు నాగరాణి వివాహం సందర్భంగా రూ. 14 వేల ఆర్థిక సహాయం అందించినట్లు మిత్రులు బొలిశెట్టి కిషన్, బొలిశెట్టి రాజన్న, రాయిలీ మల్లేష్, కల్లు రాజలింగు, రామగిరి శంకర్,హరికృష్ణలు తెలిపారు.

దొంగలను పట్టిచ్చిన సెల్‌ఫోన్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

బెల్లంపల్లి/నెన్నెల, ఏప్రిల్ 4: జల్సాలకు అలవాటు పడ్డ నలుగురు స్నేహితులు కిరాణ దుకాణంలో సొత్తుతో పాటు సెల్‌ఫోన్ చోరీ చేశారు. ఆ ఫోనే వారిని పోలీసులకు పట్టిచ్చింది. నలుగురిలో ఒకరు ఎత్తుకెళ్లిన ఫోన్‌లో సిమ్ వేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. తనతో పాటు మరో ముగ్గురు కలిసి దొంగతనం చేసినట్టు ఒప్పుకొని కటకటాల్లోకి వెళ్లారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్ గురువారం కేసు వివరాలను వెల్లడించారు. వేమనపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాడె సుగుణాకర్ అలియాస్ రాము, దుర్గం రాజబాబు, నెన్నెల మండలం కోనంపేటకు చెందిన గొల్లపల్లి మహేష్, రాంటెంకి బన్ని జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీ మనీ కోసం చోరీలు చేయడం ప్రారంభించారు. నలుగురు కలిసిన మార్చి 24న రాత్రి కోనంపేటలో దుర్గం రాజారాం కిరాణ షాపులో పది గ్రాముల బంగారు ఉంగరాలు, రూ. 30 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ దొంగిలిచారు. ఎత్తుకెళ్లిన ఫోన్‌ను వెంట తీసుకెళ్లిన సుగుణాకర్ పాత సిమ్‌ను అందులో వేశాడు. దానికి ప్యాటర్న్ లాక్ ఉండటంతో స్విచ్ఛాఫ్ చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా సిమ్ వివరాలను పోలీసులు కనుగొన్నారు. కొత్తపల్లికి చెందిన పాత నేరస్థుడు సుగుణాకర్‌గా గుర్తించి అతడిని విచారించారు. మరో ముగ్గురితో కలిసి దొంగతనం చేసినట్టు ఒప్పుకోగా, నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు.

సర్టిఫికెట్లు ఇవ్వకపోతే
ఆత్మహత్యే శరణ్యం

బెల్లంపల్లి, ఏప్రిల్ 4: కుల, ఆదాయం, నివాసానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత రెవెన్యూ అధికారులు సరైన సమయంలో ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని బెల్లంపల్లిలోని అశోక్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి ప్రథమ్‌పాండే ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన మాట్లా డుతూ మీ సేవలో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానని అయినప్పటికీ సంబంధిత రెవెన్యూ కార్యాలయం అధికారులు స్పందించడం లేదన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించానని, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సీటు కోల్పోతానని, సీటు కోల్పోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశాడు.

నియోజకవర్గాల
కోఆర్డినేటర్ల నియామకం



వేముల కృష్ణ

బెల్లంపల్లి/కాసిపేట, ఏప్రిల్ 4: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని మూడు నియోజక వర్గాలకు కోఆర్డినేటర్లను నియమిస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముకేష్ కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నూరు అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా గడ్డెల హైమావతి, మంచిర్యాల కోఆర్డినేటర్‌గా వేముల కృష్ణ, బెల్లంపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మహమూద్ ఖలీద్‌ను నియమించారు. కాసిపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణకు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 4: దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ దేశ అభివృద్ధికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఆదిజాంబవంతుల, జగ్జీవన్‌రామ్ జయంతి కమిటీ నాయకులు వాసాల శంకర్, బిజునూరి శంకర్, కంబాల రాజనర్సులు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణం లోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నావున్నారు. అన్ని వర్గాల వారు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు
వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 : లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన వారందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి స్వీప్‌కోర్ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 13న ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అర్హులైన వారు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 15 వరకు ఓటరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు పోస్టర్లు, బ్యానర్లు, ఎల్ఈడీ వాహనాలు, సోషల్ మీడియా,చానళ్లు, కళాజాత, ప్రచార వాహనాల ద్వారా అవగాహన కార్యక్రమాలు కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులు తాము ఓటు వేయడమే కాకుండా పరిసర ప్రాంతాల వారు, బంధువులు ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఐఈవో శైలజ, డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, సంక్షేమాధికారి చిన్నయ్య, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు

జైనూర్, ఏప్రిల్ 4: జైనూరు గ్రామ పంచాయతీ పరిధిలో పనులు చేస్తున్న ఉపాధికూలీలకు ఎండలో నీడ కల్పించేందుకు గ్రీన్‌నెట్, మంచినీటి సదుపాయం కల్పించామని గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈఏడాది విపరీతంగా ఎండలు ఉన్నందున కూలీలు ఇబ్బందులు పడకుండా మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. అదేవిధంగా కూలీలు ఉదయం పూట పనికి వెళ్లి 10గంటలలోపు తిరిగి ఇంటికి చేరుకోవాలని కోరారు.

ప్రమాదాలకు నిలయంగా మూడు రోడ్ల కూడలి



బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల సర్కిల్ వద్ద ట్రాఫిక్ జాం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల మూడు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల మంచిర్యాల నుంచి రేచిని వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు రోడ్ల కూడలి వద్ద పై ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా కొనసాగుతున్నాయి. పనులు జరిగే చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. మూడు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉండగా చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణానికి చెందిన కుంచాల ఆంజనేయులు పని నిమిత్తం వెళ్తుండగా మూడు రోడ్ల కూడలి వద్ద బెల్లంపల్లి వైపు వెళ్తుండగా లారీ ఢీకొని మృతి చెందాడు. అదే విధంగా మరో యువకుడు కారు తప్పించి బైక్‌పై ముందుకు వెళ్లడంతో ఓ వాహనం ఢీకొని కాలు విరిగి ఆసుపత్రి పాలయ్యాడు. రహదారి పనుల కోసం వెళ్తున్న వాహనాలు ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో గాయలపాలయ్యాడు. దీంతో కాంట్రాక్టర్ కొంత డబ్బులు చెల్లించి చేతులు దులుపుకున్నాడు. మూడు రోడ్ల కూడలి వద్ద అస్తవ్యస్తంగా వాహనాలు వెళ్తుండడంతో ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు వైపుల నుంచి వాహనాలు ఒకేసారి వెళ్తుండడంతో ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఇప్పటికైనా స్థానిక పోలీసులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిప్పులు కురిపిస్తున్న భానుడు

● జిల్లాలో గరిష్టస్థాయి ఉష్ణోగ్రత ● మరో మూడు రోజులు భగభగలే..
● వడగాలులతో అల్లాడుతున్న జనం ● నిర్మానుష్యంగా రహదారులు



నిర్మానుష్యంగా ఉన్న లింగాపూర్ మండలంలోని అంబేద్కర్‌చౌక్

లింగాపూర్/ఆసిఫాబాద్, ఏప్రిల్ 4: సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. దంచి కొడుతున్న ఎండలతో జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. ఫిబ్రవరి చివరి వారం నుంచి తనప్రతాపాన్ని చూపిస్తున్న సూర్య భగవానుడు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి మరింత తీవ్రరూపం దాల్చడంతో పక్షులు, మూగజీవాలు, వృద్ధులు, చిన్నపిల్లలు, విలవిలలా డుతున్నారు. నాలుగురోజులుగా వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తున్నట్లుగానే జిల్లా అంతటా 42.5డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

గురువారం జిల్లాలోని అన్ని మండలాల్లో 40నుంచి 42.5డిగ్రీలపైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని తిర్యాని, రెబ్బెన్న, వాంకిడి మండలంలో అత్యధికంగా 42.5డిగ్రీలు నమోదు కాగా, కెరమెరి మండలంలో 41.8డిగ్రీలు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాల్లో 40.9డిగ్రీలు, లింగాపూర్ మండలంలో 38.8 సిర్పూర్(టి) మండలంలో 40.9డిగ్రీల ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలో 40.9డిగ్రీలు, దహెగాం మండలంలో 40.2డిగ్రీలు, చింతలమానేపల్లి మండలంలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10నుంచి వడగాల్పులు వీచడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. ఇళ్లలో కూడా ఉక్క పోతనుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వేసుకోవలసి వస్తోందన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇంకా జూన్ 10వ తేదీ వరకు వేడిమి నుంచి ఎలా బతుకుడో తెలియడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇక ఎండల దాటికి వ్యాపారాలు సాగడం లేదని, గిరాకీలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇకవీధి వ్యాపారులు, చిరువ్యాపారులు ఎండవేడిమిని తట్టుకొనేందుకు గొడుగులు, చెట్లకింద కూర్చుంటున్నారు. గిరాకీలు లేవని, రోజంతా కూర్చుంటో గతంతో పోలిస్తే సగం గిరాకీకావడం లేదని ఆవేదన చెందుతున్నారు.

మాణిక్‌గూడ గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



బోర్ పనితీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 4: ఆసిఫాబాద్ మండలంలోని మాణిక్‌గూడ గ్రామాన్ని గురువారం అదనపుకలెక్టర్ దీపక్‌తివారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బోరుబావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించలన్నారు. నీటివనరులు అందుబాటులో లేని మారుమూల గ్రామాలకు ట్యాంకర్లద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎల్పీవో ఉమర్ హుస్సేన్, మిషన్ భగీరథ డీఈ మథీన్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

దహెగాం, ఏప్రిల్ 4: కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో మార్చిలో కుష్టువ్యాధి లక్షణాలుగల అను మానితులను 46మందిని గుర్తించి పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహించగా నలుగురికి వ్యాధిఉన్నట్లు నిర్ధారించామన్నారు. స్పర్శలేని మచ్చలు ఉన్నవారు పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు స్పందన, పావని, సీహెచ్ఎన్ సంపత్, లెప్రసీ ప్రోగ్రాం అధికారిరాజు, హెచ్ఏ ఓదేలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

● పట్టించుకోని అధికారులు



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 4: చింతలమానేపల్లి మండలంలోని డబ్బా, బారెగూడ గ్రామాల మధ్యలో వాగు ఒడ్డు సమీపంలో ప్రధానరహదారి పక్క మిషన్‌భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతుంది. రెండురోజుల క్రితం పైపులైన్ పగిలిపోయి రెండు గ్రామాల్లో నీరు అందక నానా తంటాలు పడుతున్నా ఎవరు పట్టించుకోడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిషన్‌భగీరథ అధికారులకు, పాలకులకు గ్రామస్తులు తెలియజేసినా ప్రజలను పట్టిచుకునే నాథుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో వ్వుడే బావులలో నీరు ఎండిపోయి నీటికష్టాలు ఎదుర్కొంటున్నామని, అలాంటి సమయంలో పైపు లైన్ పిగిలినీరు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు జరిపి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కన్నుల పండువగా శ్రీరాధాకృష్ణ విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని కర్జవెల్లి గ్రామంలో ఓంకార ఆశ్రమంలో మూడురోజుల పాటు కన్నుల పండువగా రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. గురువారం రాధాకృష్ణ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. హోమం, ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. విష్ణుసేవా నందగిరిస్వామి, నారాయణనందగిరి స్వామి, జగదీశ్వరనంద గిరిస్వామి, విష్ణుదేవానంద సరస్వతిస్వామి, సదాశివనంద స్వామి, అంబేదానంద స్వామి, సత్యమౌలిక మాతాజీ, స్వామి శివరామకృష్ణ బ్రహ్మచారి, కరీంనగర్ గీతామందిర ఆశ్రమపండితులబృందం రామచంద్రశాస్త్రీ ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

బెల్లంపల్లి అబ్బాయి.. లండన్ అమ్మాయి



వివాహం చేసుకుంటున్న రాజ్- డయానా

బెల్లంపల్లి, ఏప్రిల్ 4: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన రాజ్ మూడేళ్ళుగా లండన్‌లో వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. ఈ క్రమంలో లండన్‌కు చెందిన డయానా అనే యువతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే డయానాకు ఇండియాలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలని రాజ్‌ను కోరింది. వీరి ప్రేమ, వివాహం విషయం ఇరు కుటుంబాలు ఒప్పుకోవడంతో గురువారం పట్టణంలోని కాల్‌టెక్స్‌లోని ఏఆర్ కన్వెన్షన్ హాలులో వివాహం జరిగింది. వధువు తల్లిదండ్రులు లండన్ నుంచి రావడానికి వీలు కాకపోవడంతో పెళ్లికొడుకు బావ ముత్తె వెంకటేష్-లావణ్య దంపతులు కన్యాదానం చేసి వివాహం జరిపించారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుగుణను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన, ఏప్రిల్ 4: రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం గంగాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆమె పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో తాను బరిలో ఉన్నట్టు తనను ఆదరించి అధిక మెజార్టీతో గెల్పించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీర శ్యాంనాయక్, మండల అధ్యక్షుడు లావుడ్యా రమేష్, మసాడి చరణ్, జువ్వాజీ అనిల్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, గుంటుమేర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

దహెగాం, ఏప్రిల్ 4: మండలంలోని ఖర్జి గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ సహిత శివపంచా యతన ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కన్నులపండగవగా సాగింది. శిఖర ప్రతిష్ఠాపన, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం మూడు రోజులపాటు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు.



శిఖర ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న భక్తులు

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్లపై కేసు నమోదు



పోలీసుల అదుపులో ఉన్న బెట్టింగ్‌రాయుళ్లు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4: కాగజ్‌నగర్ మండలంలోని జీడిచేనులో ఐపీఎల్ బెట్టింగ్ చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా టాస్క్‌ఫోర్సు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు ముందస్తు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు తెలిపారు. వారివద్ద ఉన్న ఐదుసెల్ ఫోన్లు, రూ.30వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

ట్రెటా జిల్లా కార్యవర్గం

ఏసీసీ, ఏప్రిల్ 4 : తెలంగాణ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌సింగ్, ఆర్థిక కార్యదర్శిగా సత్యనారాయణ, సలహాదారుడుగా రాజమల్లు, కార్యవర్గ సభ్యులుగా భాస్కర్, ఆనంద్‌చారీలను ఎన్నుకున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:32 శుక్రవారం

సహర్ | 4:43 శనివారం

ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేపట్టాలి

రామగుండం సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, ఏప్రిల్ 4: జనావాసాల మధ్య ఉన్న అపార్టుమెంట్‌లు, గోడౌన్‌లు, స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియాలు, ఇతర వాణిజ్య సముదాయాల్లో అధికారులు ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేపట్టాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని అగ్నిమాపక శాఖ అధికారులు, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, వివిధ పరిశ్రమల ఫైర్ సేఫ్టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. అగ్ని ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే పరిధితో సంబంధం లేకుండా దగ్గరలో ఉన్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది, అధికారులు స్పందించాలన్నారు. ప్రమాదానికి సమీపంలో ఉన్న నీటి లభ్యత గురించి అవగాహన కలిగి ఉండాలని, ఇందుకు అనుగుణంగా మంటలను ఆర్పేందుకు సిద్ధం కావాలన్నారు. ఎత్తైన భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, అపార్టుమెంట్లలో అగ్నిమాపక తనిఖీలు చేయాలని, మున్సిపల్, పోలీస్, ఫైర్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత కాలంలో తనిఖీలను పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రులు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, వాణిజ్య భవనాల్లో క్రమం తప్పకుండా ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలను పరిశీలించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొన్ని భవనాల సెల్లార్‌లలో షాపులు నిర్వహిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. మంచిర్యాల జిల్లా ఫైర్ ఆఫీసర్ అజయ్‌కుమార్, మంచిర్యాల, బెల్లంపల్లి స్టేషన్‌ల ఫైర్ ఆఫీసర్లు దేవేందర్, అనిల్‌కుమార్, ఎన్టీపీసీ సేఫ్టీ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డులు తిప్పేస్తున్న చిట్‌ఫండ్ కంపెనీలు

- ఉమ్మడి జిల్లాలో 91 కంపెనీలకు రిజిస్ట్రేషన్
- వందల సంఖ్యలో ప్రైవేటుగా చిట్టీల నిర్వహణ
- సాలీనా కోట్లాది రూపాయల టర్నోవర్
- నగదు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- లబోదిబోమంటున్న బాధితులు



మంచిర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ పుట్టుకొస్తున్న కొన్ని చిట్‌ఫండ్ కంపెనీలు కస్టమర్లను నిలువునా ముంచుతున్నాయి. చట్టాల్లో ఉన్న లొసుగుల ఆధారంగా సులువుగా డబ్బు సంపాదించే లక్ష్యంతో యేటా పదుల సంఖ్యలో చిట్‌ఫండ్ కంపెనీలు ప్రారంభమవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ కంపెనీలకు చెందిన 91 చిట్‌ఫండ్ కంపెనీలకు రిజిస్ట్రేషన్‌లు ఉంటే అందులో మంచిర్యాల జిల్లాలోనే 80కి పైగా కంపెనీల బ్రాంచిలు ఉన్నాయి.

ఎలాంటి రిజిస్ట్రేషన్లు, అనుమతులు లేకుండా ప్రైవేటుగా చిట్టీలు నిర్వహించే వాటి సంఖ్య వందల్లోనే ఉంటుందని అంచనా. సింగరేణి కార్మికులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, గిరిగిరి ఫైనాన్స్ నిర్వాహకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రైవేటుగా చిట్టీల దందా నడుపుతుండగా, ఫైనాన్స్ కంపెనీలకు అనుబంధంగా చిట్టీల వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతోంది. కొన్ని ఫైనాన్స్ కంపెనీల పేరుతో రిజిస్ట్రేషన్‌లు ఉండగా, వాటిల్లో అక్రమంగా చిట్టీల దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

బోర్డులు తిప్పేసిన సంఘటనలెన్నో..!

రిజిస్ట్రేషన్లు కలిగి ఉండి కూడా బోర్డులు తిప్పేసి కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో పరారైన కంపెనీలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో ఐదు సంవత్సరాల క్రితం విపంచి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ బోర్డు తిప్పేసి, కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో ఉడాయించింది. ఈ కంపెనీలో చిట్టీలు వేసిన వందలాది మంది నిట్టనిలువునా మునిగిపోయారు. పోలీస్‌స్టేషన్లలో కేసులు వేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. రిజిష్టర్డ్ చిట్‌ఫండ్‌లో గ్రూపులు ప్రారంభించే ముందుకు ఆ చిట్టీ విలువ మొత్తానికి సరిపడా నగదును ముందుగానే అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే సదరు గ్రూప్ అధికారులు నెంబరు కేటాయిస్తారు. అయితే ఉమ్మడి జిల్లాలో కొందరు వ్యాపారులు కేవలం తమ కంపెనీలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేయిస్తూ గ్రూపులకు అనుమతులు తీసుకోకపోవడంతో వినియోగదారులు మోసపోతున్నారు. 10 గ్రూపులున్న కంపెనీలో కేవలం ఎనిమిదింటికి మాత్రమే అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో పదుల సంఖ్యలో ప్రైవేటు చిట్టీ నిర్వాహకులు ప్రజల డబ్బుతో ఉడాయించిన సంఘటనలు ఉన్నాయి.

సాలీనా రూ. 100 కోట్లకు పైగా టర్నోవర్

రిజిష్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీల ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యేటా దాదాపుగా రూ.100 కోట్లకుపైగా లావాదేవీలు జరుగుతాయని అంచనా. ఇవిగాక ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే చిట్టీలు మరో రూ.25 కోట్లకుపైగా ఉంటాయని సమాచారం. రాష్ట్రస్థాయిలో కమిషనర్ (రిజిస్ట్రార్) ఆఫ్ చిట్స్ పర్యవేక్షణలో రిజిష్టర్డ్ కంపెనీలు తమ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది.

అయితే కొన్ని కంపెనీలు రిజిస్ట్రేషన్ నియమ, నిబంధనలకు విరుద్ధంగా తమ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కంపెనీలు రిజిష్టర్ అయినా, వాటిలో నిర్వహించే గ్రూపులకు ఎలాంటి అనుమతులు లేకుండానే చిట్టీల నిర్వహణ చేపడుతున్నట్లు సమాచారం. ఒక్కో చిట్‌ఫండ్ పరిధిలో కనీసం 10 గ్రూపులకు తగ్గకుండా వ్యాపార లావాదేవీలు జరుతుంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 129 బ్రాంచీలు పని చేస్తుండగా 957 చిట్టీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. రూ. 1 లక్ష మొదలుకొని రూ. 10 లక్షల విలువగల చిట్టీల నిర్వహణ జరుగుతుంది.

అలాగే ఒక్కో గ్రూపులో గరిష్టంగా 50 మంది సభ్యులు ఉండగా, వారి నుంచి నెల వాయిదా కింద కనీసం రూ.5వేల చొప్పున చిట్టీ లెక్కన కాల పరిమితి 50 నెలలు ముగిసే సరికి రూ.12 కోట్ల 5 లక్షలకుపైగా వసూలు అవుతుంది. అలా ఒక్కో చిట్‌ఫండ్ ద్వారా సాలీనా కోట్లాది రూపాయల టర్నోవర్ జరుగుతుంది. కొన్ని చిట్‌ఫండ్‌లలో చిట్టీల నిర్వహణతోపాటు అక్రమంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

అచల కంపెనీపై చర్యలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్రాంచిలు ఉన్న అచల చిట్‌ఫండ్ కంపెనీని రెండు రోజుల క్రితం మూసివేసినట్లు ఆదిలాబాద్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ తెలిపారు. చిట్టీ కాలపరిమితి ముగిసినా నగదు చెల్లింపుల్లో జాప్యాన్ని నిరసిస్తూ బాధితులు ఫిర్యాదులు చేయడంతో స్పందించిన అధికారులు మూసివేతకు ఆదేశాలు జారీ చేశారు. అయితే అచల లాగే మరిన్ని కంపెనీలు ఉడాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫిర్యాదులు చేస్తే తప్పా చిట్‌ఫండ్ కంపెనీల నిర్వహణపై దృష్టి సారించడం లేదని, ఇప్పటికైనా చిట్‌ఫండ్ కంపెనీలను నిబంధనల మేరకు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్గితో జాగ్రత్త

- జిల్లాలో నాలుగు ఫైర్‌స్టేషన్లు
- అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు
- ఈనెల 14 నుంచి 20 వరకు అవగాహన కార్యక్రమాలు
- అందుబాటులో ఆధునిక పరికరాలు

ఏసీసీ, ఏప్రిల్ 4: వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. ఏమాత్రం పొరపాటు చేసినా అది మనకు ఎంతో ప్రమాదం కలుగజేస్తుంది. వంట గది, పంట చేన్లు, షాపింగ్‌మాల్స్ ఆసుపత్రులు, విద్యాలయాలు, ఆఫీస్‌లు, పెట్రోలు బంకులు, సినిమాహాళ్లు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలు స్థలమేదైనా అప్రమత్తంగా ఉండాల్సిందే.

అవగాహన కార్యక్రమాలు

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యల్లో భాగం గా యేటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తారు. రైల్వేస్టేషన్‌లు, బస్‌స్టేషన్‌లు, ఆసుపత్రులు, విద్యాలయాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరిస్తారు. జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఎలక్ట్రికల్ సామగ్రి ఐఎస్ఐ మార్క్ ఉన్న వాటిని మాత్రమే వాడాలని, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఎంసీబీలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో నాలుగు ఫైర్ స్టేషన్లు

మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు బెల్లంపల్లి, జన్నారం, చెన్నూరులో నాలుగు ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌లో ఒక ఫైర్ ఆఫీసర్, ముగ్గురు డ్రైవర్లు, 12 మంది ఫైర్‌మెన్‌లు, మొత్తం 16 మంది సిబ్బంది ఉన్నారు. నాలుగు ఫైరింజన్‌లు, బైక్‌లు, బోట్లను అందు బాటులో ఉంచారు. ఇతర విపత్తులైన వరదలు, భూకంపాలు, భవనాలు కూలిపోవడం, వాహనాలు ఢీకొనడం వంటి విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు వీలు గా అత్యాధునిక పరిక రాలు, సామగ్రి అందుబాటులో ఉంది. గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఈ సం వత్సరం మార్చి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 164 అగ్ని ప్రమాదాలు జరిగాయి. పంట చేన్లలో ఎండిన గడ్డి ఇతర వ్యర్థాలను కాల్చివేసే క్రమంలో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. గోడౌన్‌లు, సినిమా హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సముదా యాలు, విద్యా సం స్థలు, ఆసుపత్రులు నిర్మించే ముందు అగ్ని మాపక శాఖ అనుమతి పొందాలి. వారు సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంటే ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడవచ్చు. ఇండ్ల లో ఎలక్ట్రికల్ పరికరాలపై అధిక లోడు పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీ ప్రమాదాలు జరగకుండా కంపెనీలు సూచించిన గ్యాస్ పైపులను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.

పెనుముప్పు ఏర్పడకుండ నివారిస్తున్నాం

దేవేందర్, మంచిర్యాల ఫైర్ ఆఫీసర్

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఫోన్‌లో సమా చారం అందిన వెంటనే సంఘటన స్థలానికి బయలుదేరి వెళ్తున్నాం. సంఘటన స్థలానికి చేరుకునే లోపే ఫోన్ ద్వారా బాధితులకు సలహాలు, సూచనలు అందించి పెను ముప్పు ఏర్పడకుండా నివారిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలను చైతన్య వంతులను చేయడానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. గతంతో పోల్చితే ప్రమాదాలు బాగా తగ్గాయి.



అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

మంచిర్యాల : 8712699195, 08736-252101/8712699194

బెల్లంపల్లి : 8712699199, 08735-225101/8712699198

జన్నారం : 8712699197, 08739-245101/8712699196

చెన్నూరు : 8712699201, 08737-242101/8712699200

జిల్లాలో సంవత్సరకాలంలో జరిగిన ప్రమాదాలు

మంచిర్యాల పరిధిలో 54, బెల్లంపల్లి పరిధిలో 46, జన్నారం పరిధిలో 38, చెన్నూరు పరిధిలో 26. ప్రమాదాల్లో ఆస్తినష్టం రూ.1.5 కోట్లు కాగా కాపాడిన ఆస్తి విలువ సుమారు రూ.2.5 కోట్లు.





నస్పూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది, ఫైర్‌స్టేషన్‌లో ఉన్న బైక్

మహిళల రక్షణ కోసమే షీటీంలు

ఏసీసీ, ఏప్రిల్ 4: మహిళలు, బాలికల రక్షణ కోసమే షీటీంలు పని చేస్తున్నాయని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల షీటీం పోలీసులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు, మహిళల కోసం చేపడుతున్న రక్షణ చర్యలు, భవిష్యత్‌లో చేయాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ మహిళలు సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆకతాయిలు మహిళలు, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, యువతులకు ఏమైనా సమస్యలుంటే షీటీంలకు ఫిర్యాదు చేయాలన్నారు. డయల్ 100, వాట్సాప్‌నెంబర్ 6303923700లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌ల ద్వారా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, మంచిర్యాల షీటీం ఎస్ఐ హైమా, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్, ఏప్రిల్ 4: పలు గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జనంపెల్లి బానేష్, వెంకట్రావుపల్లి మాజీ ఉపసర్పంచు కుమ్మరి తిరుమలవాసు, వార్డు సభ్యులు జాడి రవి, కుమ్మరి రాజ్‌కుమార్, ఆరేపల్లి సిద్దులు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, మంతెన లక్ష్మణ్, సంపత్‌రెడ్డి, అంబాల రవి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న వేద పండితులు

హాజీపూర్, ఏప్రిల్ 4 : ముల్కల్లలోని గోవింద క్షేత్రంలో నిర్మించిన ఉప ఆలయంలో గురువారం గోవిందరాజ సహిత భూవరహాస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రాణ ప్రతిష్ఠ, కలశ ప్రోక్షణ, కళాన్యాసం శిఖర ప్రతిష్ఠ, శాంతి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు బిల్లా రాజ్యలక్ష్మీమల్లయ్య దంపతులు, వారి కుమారుడు వికాస్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి



ఓట్లు వేయాలని కోరుతున్న గోమాస శ్రీనివాస్

ఏసీసీ, ఏప్రిల్ 4: ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి బీజేపీకి మద్దతు తెలపాలని కోరారు. వాకర్స్‌తో కలిసి యోగా చేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా యోగాకు ప్రధాని మోదీ గుర్తింపు తీసుకువచ్చారన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, వర్ధన్, తుల మధుసూదన్, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, రాజమల్లు పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో గురువారం బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. దుకాణ సముదాయాలకు వెళ్లి ఓట్లు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీగా గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు రూ.500 ఇవ్వాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4: ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.500 ఇవ్వాలని పీడీఎస్‌యూ ఆర్‌పీఐ, టీవీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల పరిసరాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.272 ఉన్న కూలీని రూ.300లకు పెంచి గొప్పలు చెప్పుకుంటుందని, రోజు కూలీ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కొలతలతో పేరుతో కోత విధించకుండా రోజు మొత్తం కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు శేఖర్, ప్రశాంత్‌కుమార్, రహీం, అరుణ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతవుతున్న అడవులు



దేవాపూర్ అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న మంటలు

కాసిపేట, ఏప్రిల్ 4: ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలోని దేవాపూర్ గుట్టల్లో చెలరేగిన మంటలు చింతగూడెం, గురువాపూర్ గుట్టలకు వ్యాపించాయి. కొందరు ఆకతాయిలు అడవిలో రాజేసిన నిప్పు అడవినంతటిని కాల్చివేస్తోంది. వారం రోజులు నుంచి చెలరేగుతున్న మంటలను అదుపు చేసేందుకు అటవీ శాఖ అధికారులు కృషి చేస్తున్నప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం చింతగూడెం, గురువాపూర్ అటవీ ప్రాంతంలో మంటలు కొంత అదుపులోకి వచ్చాయి. దేవాపూర్ అటవీ శివారు ప్రాంతంలో అగ్నికీలలు ఎగిసి పడుతున్నాయి. మండుతున్న ఎండలకు అడవి అంతా అగ్నిగోళంలా తయారైంది. అడవిలో రేగిన కార్చిచ్చుకు వన్యప్రాణులు చెల్లా చెదురవుతున్నాయి. దీనిపై బెల్లంపల్లి అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్‌ను వివరణ కోరగా మంటలను అదుపు చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి ఎయిర్ బ్లోయ ర్‌ల సహాయంతో మంటలను నియంత్రిస్తున్నామన్నారు. గురువాపూర్, చింతగూడెం అటవీ ప్రాంతం లో మంటలు అదుపులోకి వచ్చాయి. దేవాపూర్, మల్యేపల్లి అడవిలోని మంటలను నియంత్రించేం దుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

వేసవి పూర్తయ్యే వరకు తాగునీటి సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకులు కృష్ణఆదిత్య

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 : వేసవి కాలం పూర్తయ్యేంత వరకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకులు కృష్ణఆదిత్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్‌లు బదావత్ సంతోష్, వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్‌లు రాహుల్, దీపక్ తివారీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా ప్రక్రియను పరిశీలించాలని, ఏమైనా ఇబ్బందులుంటే చర్యలు చేపట్టాలన్నారు. జన్నారం మండలానికి కడెం ప్రాజెక్టు ద్వారా 2.3 టీఎంసీ నీటిని సరఫరా చేస్తామని, బెల్లంపల్లి నియోకవర్గంలోని 7 మండలాలకు 1.8 టీఎంసీల నీరు అవసరం ఉండగా అడ ప్రాజెక్టు నుంచి సరఫరా చేస్తామన్నారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, గ్రామాల్లో ఎంపీడీవోలు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. బోర్‌వెల్‌లు, పైపులైన్‌ల లీకేజీలకు మరమ్మతు చేయించాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిని అందించాలన్నారు. వచ్చే మూడు నెలలు ప్రతి ఇంటికి నీటికి అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నీటి అవసరం ఉన్న గ్రామాల్లో బోర్‌వెల్‌లు అద్దెకు తీసుకుని నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి సరఫరా అయ్యే తాగునీటిపై రోజు పర్యవేక్షిస్తామని తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిధిలోని ఎల్లంపల్లి నుంచి, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా అడ ప్రాజెక్టు, నిర్మల్‌లోని కడెం ప్రాజెక్టు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హాజీపూర్, ఏప్రిల్ 4: ముల్కల్ల గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్వయం సహాయక సంఘం గ్రూపు మహిళలు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

ఈనెల 7న ప్రవేశ పరీక్ష

మందమర్రిరూరల్, ఏప్రిల్ 4: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఈ నెల 7న అర్హత పరీక్ష జరుగుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 6వ తరగతిలో విద్యార్థులకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల పరీక్ష ఉంటుందన్నారు. మందమర్రిలోని మోడల్ స్కూల్, కార్మెల్, సింగరేణి పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

ఇల్లు అమ్మబడును.

మంచిర్యాల సిసిసి కార్నర్ ఆదిత్యస్కూల్ దగ్గర, విద్యానగర్‌లో జి+1 ఆర్.సి.సి బిల్డింగ్ అమ్మబడును. సంప్ర : 98495 78536

AJK-185855

WANTED

» SOUS CHEF for Newly Opening Multi -Cuisine Restaurant in VIJAYAWADA, AP (South Indian, Chinese & Continental). Exp: 8 + Years, Qual: Degree, Resume : m3344 b@gmail.com

AJB-182035

3 + 2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : మంచిర్యాల
సెల్ : 99854 11038, 99854 03314

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : కాగజ్‌నగర్
సెల్ : 99854 08147